క్లుప్తంగా

బొడ్రాయి ప్రతిష్ఠాపన



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికి మంచి జరగాలని, పాడిపంటలు బాగా పండి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలనే లక్ష్యంతో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సర్పంచ్ శ్రీలత, ఉపసర్పంచ్ ఎల్లయ్య పాల్గొన్నారు.

పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కోనరావుపేట: మండలం పల్లిమక్తలో పెద్దమ్మ పెద్దిరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం కల్యాణోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ దంపతులు, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి, సర్పంచ్ అనిల్, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, సర్పంచులు సంతోష్, దేవయ్య, లావణ్య, ఎంపీటీసీ మల్లేశం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయిని ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సిరిసిల్ల కల్చరల్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన డీజే సంగీత విభావరి ఆహుతులను, ప్రేక్షకులను విశేషంగా అలరించింది. బీ4 ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు వడ్డిపెల్లి లక్ష్మీకాంత్ సారథ్యంలో రూపొందించిన మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. సంగీత విభావరి ద్వారా వచ్చిన ఆదాయాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించనున్నట్లు లక్ష్మీకాంత్ తెలిపారు. అతిథులుగా రాష్ట్ర పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లారీలు రావు.. బస్తాలు పోవు

- మిల్లులకు తరలని ధాన్యం
- కొనుగోళ్లు ప్రారంభమై నెల
- బస్తాకు రూ.2 ఇస్తేనే లారీలు
- తూకం వేసింది 15 వేల క్వింటాళ్లు
- ఇంకా సేకరించాల్సింది 2.50 లక్షల క్వింటాళ్లు
- ఆందోళనలో రైతులు



తూకం వేసిన ధాన్యం బస్తాలు

ఇల్లంతకుంట: రైతులకు అడుగడుగున కష్టాలు వెంటాడుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర దొరుకుతుందని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే ఇక్కడి పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు వాపోతున్నారు. కొనుగోళ్ల కోసం ధాన్యం కుప్పలుగా పోసి రెండు నెలలు కావస్తున్న ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 40 శాతం కూడా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు.

ఇల్లంతకుంట మండలంలోని 33 గ్రామాల్లో ఇల్లంతకుంట, గాలిపల్లి సొసైటీలతో పాటు, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 31 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఇల్లంతకుంట సహకార సంఘం ఆధ్వర్యంలో 1.13 లక్షల క్వింటాళ్ల ధాన్యం తూకం వేయగా మిల్లులకు 99 వేల క్వింటాళ్లు మాత్రమే చేరుకుంది. ఇంకా 15 వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు కేంద్రాల్లోనే లారీల రాక నిలిచిపోయింది. గాలిపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో 10 వేల క్వింటాళ్లు, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 29 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. 20 రోజుల క్రితం అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఇప్పుడు వరి కోతలు కోసి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసిన తర్వాత తూకాలు వేసి లారీలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే బస్తాలు

కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో నాలుగైదు రోజుల క్రితం తూకం వేసిన బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉండటంతో కొత్తగా తూకం వేయడం లేదు.

బస్తాకు రూ.2 ఇవ్వాలట

బస్తాకు రూ.2 చొప్పున ఇస్తే తప్ప ధాన్యం బస్తాలు తీసుకుపోవడం కుదరదని లారీ ట్రాన్స్‌పోర్టర్లు చెబుతుండటంతో రైతులు అయోమయంలో పడుతున్నారు. ఒక పక్క క్వింటాలుకు నాలుగు నుంచి ఐదు కిలోల ధాన్యం తరుగు తీయడం, బస్తాకు రూ.2 ఇవ్వడం, క్వింటాలుకు హమాలీ రూ.40 నుంచి రూ.50 వరకు చెల్లించడం చూస్తే తీరా తమకు మిగిలేది ఏంటని రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోయిన ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకునేవాళ్లమని రైతులు వాపోతున్నారు.

బియ్యంకు తరలుతున్న లారీలు

గత వర్షాకాలం సీజన్‌లో రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు బియ్యంగా మార్చడంతో పౌరసరఫరాల శాఖకు బియ్యం తరలించడం కోసం లారీలు వెళ్తుండటంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత ఏర్పడింది. ఇన్ని నెలలుగా మిల్లర్లు ధాన్యం బియ్యంగా మార్చకుండా ఇప్పుడు కొనుగోళ్ల సీజన్‌లోనే బియ్యం చేయడం ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

ఇప్పటి వరకు సుమారు 1.50 లక్షల క్వింటాళ్ల వరకు ధాన్యం సేకరించడం జరిగింది. ఇంకా 2.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించాల్సి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తేనే కొనుగోళ్లు సజావుగా సాగుతాయని, ఒక్కో కొనుగోలు కేంద్రానికి రోజు రెండేసి లారీలు వస్తేనే 20 రోజుల్లో కొనుగోళ్లు పూర్తి అవుతాయని, ఇలాగే మందకోడిగా కొనుగోళ్లు సాగితే మరో 20 రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుండటంతో ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఉందని అంటున్నారు.

ట్రాక్టర్లలో మిల్లులకు..

ధాన్యం తూకం వేసిన తర్వాత లారీలు రాకపోవడంతో రైతులు తమ సొంత ఖర్చులతో ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని రైస్‌మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే సమయంలో చివరి గింజ వరకు కొంటామని హడావుడి చేయడం వరకే సరిపోతుందని, తర్వాత రైతులను పట్టించుకోవడం లేదంటున్నారు.

ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్న



వరి కోసి నెల రోజులవుతున్న కూడా లారీలు సక్రమంగా రాకపోవడంతో ధాన్యం తూకం వేయడంలో ఆలస్యం అవుతుందని ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్ రూ.1800 అమ్ముకున్న. ప్రభుత్వం పేరుకు మాత్రమే మద్దతు ధర అని చెబుతూ క్వింటాల్‌కు ఐదు కిలోల వరకు తరుగు పేరుతో దోపిడీ చేస్తుంది. రైతులను ప్రభుత్వం చాలా ఇబ్బందులకు గురి చేస్తోంది.

– బత్తిని స్వామి, రైతు,రహీంఖాన్‌పేట

లారీలు రాక కొనుగోళ్లు సాగడం లేదు



మా పెద్దలింగాపూర్ గ్రామంలో ఈ యాసంగి సీజన్‌లో 25 నుంచి 30 వేల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నెలన్నర అవుతున్నా తూకం సక్రమంగా సాగడం లేదు. అధికారులకు చెప్పినా రైతుల సమస్య పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి లారీలు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకుని ధాన్యం తూకం త్వరగా అయ్యేలా చూడాలి.

– పసుల వెంకటి, రైతు,పెద్దలింగాపూర్

సమస్య లేకుండా చూస్తాం



ఇల్లంతకుంట సొసైటీ పరిధిలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటి వరకు 1.13లక్షల ధాన్యం సేకరించడం జరిగింది. మరో లక్షన్నర క్వింటాళ్ల వరకు ధాన్యం సేకరించాల్సి ఉంది. లారీల సమస్య కొంత మేరకు ఉంది. జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ లారీలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. వేగంగానే ధాన్యం తూకం వేస్తాం.

– రవీందర్‌రెడ్డి, సీఈవో, ఇల్లంతకుంట సహకార సంఘం

రాజీవ్‌గాంధీకి నివాళి

స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాల్లో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగంలో అభివృద్ధికి నాంది పలికిన సేవలు చిరస్మరణీయం అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ కన్న కలలను నిజం చేయడమే కాంగ్రెస్ కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు చేపూరి గంగాధర్, బుర్ర రాములు, కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యంబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, షేక్ ఫిరోజ్‌పాషా, యెల్ల బాల్‌రెడ్డి, వన్నెల రమణారెడ్డి, తర్రె మనోహర్, జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీటీసీ మ్యాకల గణేశ్, శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి గొట్టె ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సిరిసిల్లటౌన్/ముస్తాబాద్/చందుర్తి/తంగళ్లపల్లి/కోనరావుపేట/బోయినపల్లి/రుద్రంగి/ఎల్లారెడ్డిపేట



సిరిసిల్లటౌన్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి జోహార్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బోయినపల్లి: తడగొండలో..



ముస్తాబాద్‌లో రాజీవ్‌కు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చందుర్తిలో నివాళి అర్పిస్తున్న జెడ్పీటీసీ

మరమ్మతు మరిచారు



రిజర్వాయర్ మత్తడి కింది దారి

రుద్రంగి: మండల కేంద్రంలోని నాగారం రిజర్వాయర్ మత్తడి కింద దారి వర్షాకాలం కురిసిన వర్షాలకు పూర్తిగా కోసుకుపోయి నడవడానికి వీలు లేకుండా మారింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో, మరమ్మతులకు నోచుకోకుండా నాగారం చెరువు కింది ఉన్న దసరా పనాయక్ తండా నుంచి పైనున్న కుక్కలగండి తండాకు వెళ్లే గిరిజనులు సుమారు ఐదారు కిలోమీటర్లు తిరిగి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. అలాగే పంట పొలాలకు వెళ్లే రైతులు, చెరువుకు వెళ్లే మత్స్యకారులు అతి కష్టం మీద కోసుకుపోయిన దారిని దాటి కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పంట పొలాల వద్దకు వెళుతున్నారు. ఇప్పటికైనా స్పందించి కోసుకుపోయిన దారిపై బ్రిడ్జి నిర్మించి, సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టి



పశువుల నీటి తొట్టి

కోనరావుపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న పశువుల తొట్టి నిరుపయోగంగా మారింది. కొన్నేళ్ల క్రితం ఉపాధి హామీ పథకంలో నిర్మించారు. దీనికి నీటి సౌకర్యం కల్పించకపోవడంతో అది పనికిరాకుండా తయారైంది. ఈ తొట్టిని వినియోగించకపోవడంతో చుట్టుపక్కల పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. చుట్టు పక్కల దుకాణాల చెత్తాచెదారాన్ని వీటిలో పడేస్తున్నారు.

పాఠశాల గదుల నిర్మాణ పనులు ప్రారంభం

ఇల్లంతకుంట: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించబోతున్న రెండు తరగతి గదుల నిర్మాణానికి ఆదివారం ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాడు చదువుకున్న పాఠశాలపై మక్కువతో సొంత ఖర్చులు పెట్టి తరగతి గదులు నిర్మాణం చేయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ప్రసాద్



ప్రసాద్‌ను సన్మానిస్తున్న పాత్రికేయులు

వేములవాడఅర్బన్: బోయినపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పట్నం ప్రసాద్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం సమావేశమై అధ్యక్షుడిగా బలపరుస్తూ తీర్మానం చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. ప్రసాద్‌ను రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు కొదురుపాకలో అభినందనలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, అనుముల భాస్కర్ పాల్గొన్నారు.

రోడ్లు నిర్మానుష్యం



వీర్నపల్లి: భానుడు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాడు. వీర్నపల్లి మండల కేంద్రంలో పాటు అన్ని గ్రామాల్లో రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. ఉదయం 9 గంటలకే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సూర్యుడి ప్రతాపంతో మండలంలో 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదుకావడంతో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

చందుర్తి: మండల కేంద్రానికి చెందిన మార్త గౌరయ్య అనే వ్యక్తికి రూ.24,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కును సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్ విండో అధ్యక్షులు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్ ఆదివారం అందజేశారు.

గడువులోగా పూర్తయ్యేనా?

- కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా తంగళ్లపల్లి పాఠశాల
- నత్తనడకన సాగుతున్న నిర్మాణం



సాగుతున్న పాఠశాల నిర్మాణ పనులు



తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల నిర్మాణం నమూనా

తంగళ్లపల్లి: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌కు కొత్త భవన నిర్మాణం పనులు మొదలయ్యాయి. దీంతో పాత క్లాస్ రూములను పూర్తిగా కూల్చివేశారు. కాని సెలవులు ముగిసే సమయానికి నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పేలా కనిపించడం లేదు. కార్పొరేట్ స్థాయి స్కూళ్లను తలదన్నేలా పాఠశాల భవనాలను నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు.

గతమెంతో ఘనం

ఈ పాఠశాలను నిజాం పాలనలో 1944లో నిర్మించారు. ఈ పాఠశాలలో ఎంతోమంది ప్రముఖులు విద్యనభ్యసించారు. వారిలో సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే జువ్వాడి నర్సింగరావు, పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతి, హైకోర్టు న్యాయమూర్తి వైద్య ప్రసాద్, పోలీస్ కమిషనర్ గొట్టె సుధీర్‌బాబు ఈ పాఠశాలలోనే ఉన్నారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా..

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు రూ.9 కోట్లతో ఈ భవనాన్ని సర్వాంగ సుందరంగా అన్ని వసతులతో నిర్మించేందుకు ప్రక్రియ మొదలైంది. ఏప్రిల్ 22న నూతన పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ కూడా చేశారు. ఆధునిక వసతులు, విశాలమైన తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ అందుబాటులోకి తేనున్నారు. దాంతోపాటు ఆటలకు ఇబ్బంది లేకుండా ప్లేగ్రౌండ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

కేజీ టూ పీజీ అమలు దిశగా..

తెలంగాణ సర్కారు కేజీ టూ పీజీ విద్యను అమలు చేయాలనే దృఢనిశ్చయంతో ఉంది. ఈ పాఠశాలలో భవిష్యత్తులో ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు విద్యను అందించేలా రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పాఠశాల నిర్మాణం నమూనా అందరిని ఆకట్టుకుంటోంది. కానీ పాఠశాల సెలవులు ముగిసే సమయానికి నిర్మాణం పూర్తవుతుందా అని సంశయం నెలకొంది.

నిర్మాణం మొదలయ్యింది



తంగళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్ నూతన భవనం నిర్మాణం పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రస్తుతం పాత శాలకు సెలవులు కావడంతో ఇబ్బందేమి లేదు. పనులు వేగంగా జరిగితే పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది ఉండదు.

– దూస గోవర్ధన్, హెచ్ఎం తంగళ్లపల్లి

వేగం పెంచాలి



మండల కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో పాఠశాల నిర్మాణం చేపట్టడం సంతోషకరం. కాని సెలవులు ముగిసే సమయానికి విద్యార్థులకు పాఠశాల భవనాలు అందుబాటులోకి రావాలి. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి.

– పడిగెల మానస, ఎంపీపీ

ఇబ్బంది కానివ్వం



సీఎస్ఆర్ నిధులు కింద రూ.9 కోట్లతో పాఠశాలను అత్యాధునికంగా నిర్మిస్తున్నాం. గివ్ తెలంగాణ ఫౌండేషన్ సంస్థ నిర్మాణం బాధ్యత తీసుకుంది. గడువులోగా నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– పూర్మాని మంజుల, జెడ్పీటీసీ

బోనమో పోచమ్మ



కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లో గుడాటి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గుడాటి రెడ్డి సంఘం మహిళలు నెత్తిన బోన మెత్తుకుని ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, గుడాటి రెడ్డి సంఘం అధ్యక్షుడు నోముల భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

సిరిసిల్లటౌన్: స్వచ్ఛ భారత్ ఉద్యమంలో భాగంగా సిరిసిల్ల పట్టణం క్లీన్ సిటీగా పేరొందడంలో ప్రజలు అందించిన సహకారం గొప్పదని మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య అన్నారు. ఇదే స్ఫూర్తితో 'మేరీ లైఫ్.. మేరా స్వచ్ షహర్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రీసైక్లింగ్‌కు పనికి వచ్చే పాతపేపర్లు, పుస్తకాలు, నోట్‌బుక్స్, పాతప్లాస్టిక్ వస్తువులు, పెట్‌బాటిల్స్, పాతబట్టలు, పాతచెప్పులు, షూస్ తదితర వస్తువులను అందించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో సిబ్బందికి ఇవ్వాలన్నారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ట్రిపుల్ ఆర్) నినాదంతో ప్రారంభించిన కార్యక్రమంలో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఆర్థికసాయం ఎప్పుడందిస్తారు?

వీర్నపల్లి: ధాన్యం నష్టపోయిన రైతులకు రూ.10 వేల ఆర్థికసాయం అందిస్తామని చెప్పి సీఎం కేసీఆర్ మోసం చేశాడని దిశ కమిటీ సభ్యులు బట్టు పీర్య ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలలో కురిసిన వర్షానికి ధాన్యం నష్టపోయిన రైతులకు ఇప్పటికీ ఆర్థికసాయం ఇవ్వలేదన్నారు. ఆర్థిక సాయం అందించకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

పరామర్శ

ముస్తాబాద్: మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన జెల్ల నర్సింలు అనారోగ్యంతో మృతి చెందగా, మృతుడి కుటుంబాన్ని పీసీసీ మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు ఆదివారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, వారి పిల్లల విద్యాభ్యాసానికి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, అగుళ్ల రాజేశం, తుపాకుల శ్రీనివాస్, కొండయ్య, నర్సింలు, మాదూరి కిషన్, రాజశేఖర్, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వంద మంది పేదలకు అన్నదానం నిర్వహించినట్లు ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, పొలాస రాజేందర్ తెలిపారు.